
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 18 సెప్టెంబరు 2024 | 5



దసరా, దీపావళి పర్వదినాలకు 21 వారాంతపు 'పూజ' ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు 7లో



పైపైకి..

కాగుతున్న వంట నూనెల ధరలు

మార్కెట్‌లో ఒక్కసారిగా పెరిగిన వంట నూనె ధర

15 కిలోల డబ్బా రూ.2000..

ప్యాకెట్ రూ.125..వినియోగదారులకు షాక్

దిగుమతి సుంకం పెరగడంతో రేట్లు హీట్





మండపేట, సెప్టెంబరు 17: వంట నూనె ధరలు కాగుతున్నాయి. ఒక్కసారిగా పెరిగి సలసలలాడుతున్నాయి. సన్‌ఫ్లవర్ నూనె 15 కిలోల డబ్బా ధర రూ.1730 ఉండగా ప్రస్తుతం డబ్బా నూనె రూ.2000కి చేరుకుంది. అలాగే ప్యాకెట్ లీటరు నూనె ధర రూ.108 ఉండేది. ప్రస్తుతం ఎంతో తెలుసా..? ప్యాకెట్ రూ.125కి చేరింది. అంటే కిలోకి రూ.17 వరకు పెరిగింది. ఇక పామాయిల్ ధర 15 కిలోలు పాత ధర రూ.1530 ఉంటే ఇప్పుడు పెరిగిన ధర ప్రకారం రూ.1730కి చేరింది. ప్యాకెట్ పామాయిల్ ధర రూ.95 ఉంటే పెరిగిన ధరతో ఇప్పుడు కిలో రూ.110కి చేరింది. అంటే కిలోకి రూ.15 పెరిగింది. విదేశాల నుంచి దిగమతి చేసుకున్న అయిల్‌పై దిగుమతి సుంకంను కేంద్రం పెంచటంతో శుక్రవారం అర్ధరాత్రి నుంచి ధరల్లో మార్పు వచ్చింది. మార్కెట్‌లో అయిల్ ధరలు పెరగటంతో కల్తీ ఆయిల్ లూజు విక్రయాలు పేరిట అక్రమార్కులు అడ్డగోలుగా రెచ్చిపోయే ప్రమాదం ఉంది. రోడ్డు పక్కన ఆహారం విక్రయించే ఫాస్ట్‌ఫుడ్, టిఫిన్ సెంటర్లు, నిర్వాహకులు, మాంసాహారం విక్రయించేవారు ఎక్కువగా లూజు ఆయిల్ వినియోగిస్తారు. దీంతో వినియోగదారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.



● (ఆలమూరు):

జొన్నాడ ఫ్లైఓవర్‌పై నిర్లక్ష్యపు నీడ

నత్తనడకన పనులు

మోరంపూడి ఫ్లైఓవర్ ఇప్పటికే ప్రారంభం

ఒకేసారి శంకుస్థాపన చేసినా 'జొన్నాడ'కు లభించని మోక్షం

జొన్నాడ ఫ్లైఓవర్ పనులు నత్తనడకన సాగుతుండడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి 216(ఎ)లోని రాజమహేంద్రవరం వద్ద మోరంపూడి, ఆలమూరు మండలంలోని జొన్నాడ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణాలకు 2023 జనవరిలో కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ ఒకే రోజు శంకుస్థాపన చేసి పనులకు శ్రీకారం చుట్టారు. 2024 జనవరికి పనులు పూర్తి చేసి ఫ్లైఓవర్‌లు అందుబాటులోకి తీసుకొస్తామని ప్రకటించారు. అయితే మోరంపూడి వద్ద పనులు వేగంగా జరిగి ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం కూడా ఇటీవలే జరిగింది. ఆ ఫ్లైఓవర్ ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది. అయితే జొన్నాడ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం విషయంలో మాత్రం నిర్లక్ష్యం కొనసాగుతోంది. జొన్నాడ వద్ద ఫిల్లర్స్ పనులు కూడా పూర్తి కాని పరిస్థితి. మోరంపూడి, జొన్నాడల వద్ద ఒకే సారి పనులు ప్రారంభిస్తే పనులు చేపట్టడంతో జొన్నాడపై ఎందుకంత వివక్ష చూపుతున్నారో అంతుపట్టడం లేదని స్థానికులు వాపోతున్నారు.

ప్రమాదాలకు నిలయం

ఫ్లైఓవర్ పనుల పేరుతో ఎటువంటి ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించకుండా వదిలేయడంతో తరచూ అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ పనులు ప్రారంభించిన తర్వాత పలు ప్రమాదాలు జరిగి కొందరు మృత్యువాత పడగా అనేక మంది గాయాలపాలవుతున్నారు. హైవే అధికారులు ఎటువంటి నిబంధనలు పాటించడం లేదు. దీంతో రోడ్డు ఒక సైడ్ నుంచి మరో సైడ్‌కు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు చేస్తున్నామనే విధానం తప్ప వేగవంతం చేయడం లేదు. పనులు ప్రారంభించి ఫిల్లర్స్ నిర్మాణానికే దాదాపుగా ఏడాది కాలం పట్టిందంటే ఎంత నత్తనడకన పనులు సాగుతున్నాయో అర్థమవుతోంది..

బస్సు ప్రయాణికులకు నరకం

ఆలమూరు మండలంలో అనేక గ్రామాల వారికి జొన్నాడ సెంటర్ కూడలి. పలు గ్రామాల వారు ఇక్కడికి చేరుకుని రాజమహేంద్రవరానికి వందలాది మంది ఇక్కడ నుంచి ప్రయాణం చేస్తుంటారు. ఫ్లైఓవర్ పనులతో సుమారు 21 నెలలుగా బస్సు షెల్టర్లు పూర్తిగా తొలగించి సర్వీసు రోడ్డు ఏర్పాటు చేశారు. ఈ రోడ్డులో ఎటువంటి సౌకర్యాలు లేకపోగా ఎండైనా.. వానైనా.. బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంది. సర్వీసు రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులతో బస్సులు ఎక్కడ ఆపుతారో అర్థం కాక వృద్ధులు, వికలాంగులు, మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ఎంపీ గారూ.. జొన్నాడ ఫ్లైఓవర్ పనులు ముందుకు సాగకపోవడంతో అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్ దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో సాగుతున్న ఈ పనులు గురించి ఎంపీ హరీష్ కల్పించుకుని పనులు వేగవంతం చేయడానికి కృషి చేయాలని కోరుతున్నారు.

ఫ్లైఓవర్ ముందుకు సాగడం లేదు..



ఫ్లైఓవర్ వస్తుంది.. ట్రాఫిక్ ఇబ్బందులు తప్పుతాయని అనుకుంటే దాదాపు రెండేళ్లుగా ఫ్లైఓవర్ పనులు ముందుకు సాగడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలి.

గొడవర్తి దుర్గాప్రసాద్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్, జొన్నాడ



మాట్లాడుతున్న కలెక్టర్

రేపటి నుంచి ఆన్‌లైన్‌లోనే 'ఇసుక'

అమలాపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నూతన ఉచిత ఇసుక విధానంలో వినియోగదారులు నేరుగా ఆన్‌లైన్‌లో ఇసుకను బుక్ చేసుకునే సదుపాయాన్ని ఈ నెల 19 నుంచి అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు గనులశాఖ, రవాణాశాఖ సంయుక్తంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఇసుక దారి మళ్లకుండా ఇతరులు అధిక ధరలకు విక్రయించకుండా గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందుకోసం జిల్లాల వారీగా టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే ఇసుక రవాణా చార్జీలను ప్రభుత్వం నిర్ణయించడంతో 20 టన్నుల లారీలకు వేర్వేరుగా కిలో మీటర్ల వారీగా దూరాన్ని బట్టి రవాణా చార్జీలను నిర్ణయించారన్నారు. జిల్లాలో రీచ్‌లు, స్టాకు పాయింట్ల నుంచి వినియోగదారుల ఇళ్లకు ఇసుకను రవాణా చేసేందుకు 300 వరకు వాహనాలు ఉన్నాయని, ఇప్పటికే వంద వాహనాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అయిందన్నారు. ఇసుక రవాణా ప్రక్రియ మొత్తం పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి సాయిరామ్‌సింగ్, అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణమూర్తి, రియాల్టీ ఇన్‌స్పెక్టర్ కె.సుజాత, డీటీవో అశోక్‌ప్రతాప్‌రావు, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధానమంత్రి ఆవాస్‌యోజన 2.0

ఒడిసాలో ప్రారంభించిన ప్రధాని మోదీ

జిల్లాలో తొలి విడతగా సాయం మంజూరు

ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం ఒడిసా రాజధాని భువనేశ్వర్ నుంచి లైవ్ స్ట్రీమింగ్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా ప్రధానమంత్రి ఆవాస యోజన 2.0 పథకాన్ని లాంచనంగా ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి ఈ కార్యక్రమాన్ని వీక్షించిన అనంతరం కాట్రేనికోన మండలం బ్రహ్మసమేద్యం గ్రామానికి చెందిన లబ్ధిదారు సంగాని సీతమ్మకు ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకం మంజూరు కాగా మొదటి విడతగా రూ.40 వేలు ఎఫ్‌టీఆర్‌ను కలెక్టర్ ఆమెకు అందజేశారు. జిల్లా గృహనిర్మాణ సంస్థ పథక సంచాలకుడు పి.కూర్మినాయుడు, గృహనిర్మాణ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసులతో చర్చిస్తున్న నిపుణులు


విస్ఫోటంపై విశ్లేషణ.. 7

ఫోరెన్సిక్ నిపుణుల బృందం పరిశీలన

పలు ఆధారాలు సేకరణ

పేలని గ్యాస్ సిలిండర్లు

ముగ్గురు క్షతగాత్రులకు కొనసాగుతున్న చికిత్స



ఫైల్

జాతీయ రహదారి దాటిన చిరుత 7

అప్రమత్తంగా ఉండాలని వాహనదారులకు హెచ్చరిక

విశ్వకర్మ జయంతి వేడుకలు



నివాళి అర్పిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, సెప్టెంబరు 17: యుగానికొక ప్రత్యేక నగర నిర్మాణకర్తగా విశ్వకర్మ నిలిచారని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. విశ్వానికి దైవిక, వాస్తు శిల్పి విశ్వకర్మ అని వివరించారు. కలెక్టరేట్‌లో విశ్వకర్మ జయంతి వేడుకలు పురస్కరించుకుని ఆయన పూజలు నిర్వహించారు. విశ్వకర్మ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం హిందువుల పండుగల జాబితాలో చేర్చిందన్నారు. సత్యయుగంలో ఇంద్రుడు పరిపాలించిన ఇంద్రలోకాన్ని, త్రేతాయుగంలో స్వర్ణలంకను, ద్వాపర యుగంలో ద్వారకా నగరాన్ని, కలియుగంలో హస్తినాపురాన్ని, ఇంద్రప్రస్థాన్ని విశ్వకర్మ నిర్మించినట్టు పురాణాలు ఆధారంగా భక్తులు విశ్వసిస్తారన్నారు. రాష్ట్ర వేడుకగా విశ్వకర్మ జయంతిని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకం కుల వృత్తుల వారికి ఓ ఆశాకిరణమన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

24న ముసాయిదా ఓటు జాబితా



రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం

అమలాపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గానికి తాజా ఓటర్ల జాబితా రూపకల్పనకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసినట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ చాంబర్‌లో ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటరు నమోదు ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి నవంబరు 1న అర్హత తేదీగా ఎన్నికల సంఘం నిర్ధారించిందన్నారు. ఈ మేరకు ఇప్పటికే రెండు పర్యాయాలు పబ్లిక్ నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. ఫారం-19లో ఈ నెల 3 వరకు దరఖాస్తుల స్వీకరణ జరిగిందన్నారు. 24న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తామన్నారు. క్లయిమ్‌లు, అభ్యంతరాలను అక్టోబరు 15 లోపు చేసుకునే అవకాశం ఉందన్నారు. నవంబరు 6న తుది జాబితా ప్రచురిస్తామన్నారు. ప్రతీ మండలంలో ఒక్కో పోలింగ్ కేంద్రం చొప్పున ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటింగ్ కోసం 22 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. నిబంధనల మేరకు ఎటువంటి అభ్యంతరాలకు తావు లేకుండా ఉపాధ్యాయులందరూ నమోదయ్యేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో దూరి రాజేష్ (బీజేపీ), సంసాని బులినాని, షేక్ అబ్దుల్‌ఖాదర్ (వైసీపీ), కారెం వెంకటేశ్వరరావు (సీపీఎం), భవానీ (బీఎస్పీ), సూర్యప్రకాష్ (ఆమ్‌ఆద్మీ) పాల్గొన్నారు.

ప్రస్తుతం



అంతకు ముందు



ప్రజలే..ప్రభువులు

మారిన సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల పాత ధోరణి

ప్రజలే ప్రభువులు..ప్రజా ప్రభుత్వాలలో వారికి మించిన ఏ రాజులు లేరు.. అయితే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భిన్న పద్ధతులు ఇప్పటివరకు కొనసాగేవి.. ప్రజలు తక్కువ..అధికారులే ఎక్కువ అనే ధోరణిలో అక్కడ ఏర్పాట్లు ఉండేవి.. ఏదో రాజ దర్బారుకు వెళ్లిన భావన కలిగేది.. ఇప్పుడు ఆ అధికార 'దర్పానికి' కూటమి ప్రభుత్వం చెక్ చెప్పింది.. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రాచరిక పోకడలకు స్వస్తి పలుకుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అమలాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రెడ్ కార్పెట్‌లను పూర్తిగా తొలగించి సాధారణ పౌరులు సైతం నిర్భయంగా కూర్చొనేలా కుర్చీలను ఏర్పాటుచేశారు.

అమలాపురం టౌన్, సెప్టెంబరు 17:



మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలను సత్కరిస్తున్న దృశ్యం..

ఆటో నగర్ ఏర్పాటుకు కృషి చేస్తాం

వార్త..8లో

నులిపురుగుల నిర్మూలనతో ఆరోగ్యం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 17: నులి పురుగులను నిర్మూలించి ప్రతిఒక్కరు ఆరోగ్యంగా జీవించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. రెండో విడత జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. జిల్లాలోని 3,812 విద్యాసంస్థల్లో 3,04,318 మంది విద్యార్థులకు నులి పురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేశామన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ సీహెచ్‌వీ భరతలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ ఎం.ఝాన్సీరాణి, డీఈవో ఎం.కమలకుమారి, జిల్లా వైద్యసేవల సమన్వయ అధికారి డాక్టర్ కార్తీక్, డైఐవో సత్యనారాయణ, హెచ్‌ఎం ఎస్.రాజరాజేశ్వరి, కోఆర్డినేటర్ జాన్‌లెవీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పరిసరాల పరిశుభ్రత

స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల ప్రారంభోత్సవ ర్యాలీలో కలెక్టర్



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతోనే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచగలుగుతామని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. జిల్లాను పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య కార్యక్రమాలు ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో ఎక్కడైనా చెత్త కుప్పలు కనిపిస్తే వెంటనే ఫొటోతీసి పంపిస్తే తక్షణం వాటిని తొలగించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం ప్రారంభోత్సవ ర్యాలీని మంగళవారం కలెక్టరేట్ నుంచి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు జెండా ఊపి ప్రారంభించారు. తొలుత కలెక్టరేట్‌లోని మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబరు 2 వరకు జిల్లాలో స్వభావ స్వచ్ఛత త.. సంస్కార స్వచ్ఛత ఆధారంగా స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. దేశంలో స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమం ప్రారంభమై పదేళ్లు పూర్తి అయిందని, జిల్లాలో రూ.2.50 లక్షల టాయిలెట్లను ప్రత్యేకంగా నిర్మించారన్నారు. ఇప్పటికీ పలుచోట్ల బహిరంగ మలవిసర్జన వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు వివరించే విధంగా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నామన్నారు. జిల్లా వాసులు గూగుల్ ప్లేస్టోర్‌లో మ్యాప్ మై ఇండియా అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకుని ఎక్కడైనా చెత్తకుప్పలు కనిపిస్తే ఫొటో తీసి పంపించవచ్చునన్నారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్య సంరక్షణ కోసం సెప్టెంబరు 30 నుంచి అక్టోబరు 2 వరకు జిల్లాలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌ఎంసీలల్లో హెల్త్ చెకప్‌లు నిర్వహిస్తామన్నారు. కార్మికులకు హెల్త్ ఐడీ కార్డులు, బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి హెల్త్ చెకప్‌లు చేసే కార్యక్రమం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే ఆనందరావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, జిల్లా పంచాయతీ అధికారి డిడ్డి రాంబాబు పాల్గొన్నారు. అనంతరం స్వచ్ఛతే సేవా ప్రతిజ్ఞ చేయించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, ఇన్‌చార్జి డీఆర్వో మదన్‌మోహన్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, సర్పంచ్ నక్కా అరుణకుమారి, డీఎల్పీవో పి.బొజ్జిరాజు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


సహజ పచ్చదనం కనిపించేలా ఏర్పాటుచేసిన ట్రాప్ బోను

హైవే దాటిన చిరుత పులి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 17: దివాన్‌చెరువు అటవీ ప్రాంతం మధ్యలో సోమవారం రాత్రి సుమారు తొమ్మిది గంటల ప్రాంతంలో చిరుత పులి మహా పుష్కర వనం వైపు నుంచి రిజర్వ్ ఫారెస్టు వైపు రోడ్డు దాటుతుండగా హైవేపై వెళ్లే వారు గమనించారని తూర్పు గోదావరి జిల్లా అటవీ శాఖాధికారి ఎస్.భరణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లాలాచెరువు నుంచి ఆటోనగర్ హైవేపై ఇరువైపులా ప్రయాణించే వాహనచోదకులు గమనిస్తూ ప్రయాణించాలని కోరారు. సీసీ, ట్రాప్ కెమెరాల్లో మంగళవారం చిరుత పులి కదలికలు కనిపించలేదన్నారు. అదనపు బోనులు అమర్చి చిరుత పులిని పట్టుకునేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. నివాస ప్రాంతాల్లో చిరుత సంచరిస్తున్నట్టు నిర్ధారణ కాలేదన్నారు. ప్రస్తుతం మూసి ఉన్న పుష్కర వనాన్ని చిరుత సంచారం నేపథ్యంలో మరికొన్ని రోజులు మూసి ఉంచనున్నట్టు డీఎఫ్‌వో చెప్పారు.



గణనాథునికి మహా నైవేద్యం

తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మెరక వీధిలోని వాటర్ ట్యాంకు వద్ద ఏర్పాటు చేసిన గణనాథునికి భక్తులు మంగళవారం భారీ నైవేద్యం సమర్పించారు. ఉత్సవాల్లో 11వ రోజున లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. 108 రకాల స్వీట్లు, పిండి వంటలను నైవేద్యం పెట్టారు. ఈ నెల 23న స్వామివారి లడ్డూ ప్రసాదం వేలం, అన్నదానం, గణపతి శోభాయాత్ర జరుపుతామని నిర్వాహకులు తెలిపారు.

- కొవ్వూరు

ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో
రేపటి నుంచి అండర్-19 ఆటల పోటీలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాల ఆటల ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయి అండర్-19 ఆటల పోటీలను గురువారం నుంచి నిర్వహిస్తామని ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా అధ్యక్షుడు, జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి జేవీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, జిల్లా ఉపాధ్యక్షుడు, ఆర్ఐవో ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. 2006 జనవరి 1 తర్వాత జన్మించిన వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారిని రాష్ట్రస్థాయికి పంపిస్తారని చెప్పారు. మరిన్ని వివరాలకు కార్యదర్శి శివరామకృష్ణను 9848176986 నెంబరులో సంప్రదించాలని సూచించారు. షెడ్యూల్ ఇలా... 19న రామచంద్రపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాస్కెట్ బాల్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, కరాటే, టేబుల్ టెన్నిస్ (కన్వీనరు మొబైల్: 9490300105), కాకినాడ డీఎస్ఏ మైదానంలో 21న ఫుట్‌బాల్, జూడో, స్విమ్మింగ్, తైక్వాండో, యోగా, రెజ్లింగ్, 29న వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బాక్సింగ్, జిమ్నాస్టిక్స్, వచ్చే నెల 1న ఖోఖో, హాకీ, ఫెన్సింగ్, రైఫిల్ షూటింగ్, సాఫ్ట్ టెన్నిస్, 30న పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్చరీ, రగ్బీ (కాంటాక్ట్ మొబైల్: 9866311539), వచ్చే నెల 16న మండపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టెన్నికాయిట్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, నెట్‌బాల్ (కాంటాక్ట్ మొబైల్: 8142810810), 19న జి.మామిడాడలోని ఫ్యామిలీ క్లబ్‌లో వాలీబాల్, కబడ్డీ, చెస్ (కాంటాక్ట్ మొబైల్: 9866400999), 30న కాకినాడలోని పీఆర్ డిగ్రీ కళాశాల, ఆర్ఎంసీ మైదానాల్లో అథ్లెటిక్స్, క్రికెట్, లాన్ టెన్నిస్, హ్యాండ్‌బాల్ (కాంటాక్ట్ మొబైల్: 9866311539) పోటీలు జరుగుతాయి.

పెద్దాపురం 'నవోదయ'లో ప్రవేశానికి
ఆన్‌లైన్ దరఖాస్తు గడువు పెంపు

పెద్దాపురం, సెప్టెంబరు 17: జవహర్ నవోదయ విద్యాలయలో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరవ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తు గడువును పెంచినట్టు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య తెలిపారు. నవోదయ విద్యాలయ సమితి ఆదేశాల మేరకు ఈ నెల 23వ తేదీ వరకు గడువు పెంచామని తెలిపారు. వచ్చే సంవత్సరం జనవరి 18న ప్రవేశ పరీక్ష జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

విస్ఫోటంపై...


సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరిస్తున్న ఫోరెన్సిక్ నిపుణుల బృందం


పేలుడు ధాటికి ఫర్లాంగు దూరంలో పడ్డ శకలాలను గుర్తించి ఫొటోలు తీస్తున్న ఫోరెన్సిక్ నిపుణులు

- ఫోరెన్సిక్ నిపుణుల బృందం పరిశీలన
- పలు ఆధారాలు సేకరణ
- పేలని గ్యాస్ సిలిండర్లు
- ఐసీయూలో ముగ్గురికి కొనసాగుతున్న చికిత్స




రామాలయం గేటుకు వేసిన తాళం అలాగే ఉండగా....
పక్కనే పడ్డ సైకిల్‌పై గుర్తించిన పొటాషియం క్లోరైడ్

అమలాపురం టౌన్, సెప్టెంబరు 17: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణ శివారు రావులచెరువులో జరిగిన విస్ఫోటం ఘటనపై విచారణను వేగవంతం చేశారు. విజయవాడ నుంచి వచ్చిన ఫోరెన్సిక్ నిపుణుల బృందంతో పాటు జిల్లా క్లూస్ టీమ్ సభ్యులు పోలీసులతో కలిసి మంగళవారం సంఘటనా స్థలంలో పలు ఆధారాలను సేకరించారు. విస్ఫోటం ధాటికి ఫర్లాంగు దూరంలో పంట చేల మధ్య ఎక్కడో పడ్డ శకలాలను సైతం గుర్తించి వాటిని ఫొటోలు తీశారు. భవనం కుప్పకూలిపోయేంత స్థాయిలో విస్ఫోటం జరిగినప్పుడు ఆ ఇంట్లో పేలుడు పదార్థాలు ఎంతమేర ఉన్నాయో గుర్తిస్తున్నారు. విజయవాడ నుంచి వచ్చిన ఫోరెన్సిక్ అసిస్టెంట్ సైంటిఫిక్ ఆఫీసర్ ఎన్.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలంలో అణువణువూ పరిశీలించారు. అంత పెద్ద ఎత్తున పేలుడు సంభవించినప్పటికీ ఆ ఇంట్లో ఉన్న రెండు గ్యాస్ సిలిండర్లు ఏమాత్రం చెక్కుచెదరకుండా శిథిలాల కింద ఉండడాన్ని గుర్తించి వాటిని బయటికి తీశారు. దీంతో గ్యాస్ సిలిండర్లు పేలడం వల్ల ప్రమాదం జరిగిందన్న వాదనకు ఫుల్‌స్టాప్ పడింది. ఘటనా స్థలంలో పొటాషియం క్లోరైడ్, పొటాషియం నైట్రేట్‌తో పాటు వివిధ రకాల కెమికల్స్‌ను, పేలుడు సామగ్రిని గుర్తించి శాంపిల్స్ సేకరించారు. పేలుడు ధాటికి ఎదురుగా ఉన్న రామాలయం గేటు తాళం వేసింది వేసినట్టుగా ఉండగా ఇనుప గెడ విడివడిపోవడంతో ప్రమాదం ఏ స్థాయిలో జరిగిందో గుర్తిస్తున్నారు. చిత్రమేమిటంటే ప్రమాదం జరగడానికి గంటముందు ఇంటి యజమాని గొవ్వాల నాగేశ్వరరావు మందుగుండు సామగ్రికి అవసరమైన పొటాషియం క్లోరైడ్‌ను సైకిల్‌పై తీసుకువచ్చాడు. ప్రమాదం అనంతరం పొటాషియం క్లోరైడ్ బ్యాగ్ సైకిల్‌కే ఉండిపోవడాన్ని మరుసటి రోజున గానీ ఎవరూ గుర్తించలేకపోయారు. సేకరించిన శాంపిల్స్‌ను విజయవాడ తరలించినట్టు అధికారులు తెలిపారు.

ప్రమాద కారణాలపై పోలీసుల ఆరా...

గ్యాస్ సిలిండర్లు చెక్కు చెదరలేదు. అయితే ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. సంఘటనా సమయంలో ఇంట్లో భార్యభర్తలైన గొవ్వాల నాగేశ్వరరావు, నాగలక్ష్మి, కుమారుడు యల్లీష్‌రాజుతో పాటు యానాంకు చెందిన కుమార్తె కట్టా వేణు, మనుమడు వెంకట్ ఉన్నారు. నాగేశ్వరరావు దంపతులతో పాటు కుమారుడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో కిమ్స్ ఆసుపత్రిలో ఐసీయూలో ఉంచి చికిత్స చేస్తున్నారు. నాగలక్ష్మి తలకు ఉదయం ఆపరేషన్ నిర్వహించారు. కుమార్తె వేణు, మనుమడు నుంచి ఆధారాలు సేకరించేందుకు పోలీసులు పలు విధాలా ప్రయత్నించారు. ప్రమాదం జరగడానికి ముందు ఎవరైనా మతాబులు వంటివి ఏమైనా ఇంట్లో కాల్చారా అన్న దానిపై ఆరా తీస్తున్నారు. మందుగుండు సామగ్రి తయారీకి అవసరమైన సరుకును ఎవరు విక్రయిస్తున్నారు. ఇటీవలి కాలంలో ఎంతమేర సరుకు కొనుగోలు చేశారు అన్న అంశంపై పోలీసులు దృష్టి సారించారు. పెద్ద మొత్తంలోనే పొటాషియం క్లోరైడ్, నైట్రేట్ కొనుగోలు చేసినట్టు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. వాటితో పాటు బాణాసంచా సామగ్రి కూడా ఇంట్లో ఉన్నట్టు భావిస్తున్నారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఘటనా స్థలాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు. కుటుంబ సభ్యులు ముగ్గురు మినహా మిగిలిన అందరి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉందని వైద్యులు చెప్పారు.

ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 4వ విడత ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 17: కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని ప్రభుత్వ ఐటీఐలు, కాకినాడ, జగ్గంపేట ప్రైవేట్ ఐటీఐల్లో 2024-25 సంవత్సరానికి మిగిలిన సీట్లలో ప్రవేశానికి నాలుగో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కాకినాడ, కోనసీమ జిల్లాల కన్వీనర్ ఎం.వేణుగోపాలశర్మ తెలిపారు. ఐటీ ఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 26వ తేదీ రాత్రి 11.59 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ సెంటర్లో అభ్యర్థి ఏ ఐటీఐలో చేరదలిచాడో ఆ ఐటీఐలను తప్పనిసరిగా ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఎంపిక చేసుకోవాలి. మొదటి, రెండు, మూడవ విడతల్లో ఐటీఐ సీట్లు రాని అభ్యర్థులు కూడా తప్పనిసరిగా నాల్గవ విడత రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులంతా దగ్గర్లో గల ప్రభుత్వ, ప్రైవేటు ఐటీ ఐల్లో ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలలోపు ఒరిజినల్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకుని అప్రూవ్ చేసుకోవాలి. మరిన్ని వివరాలకు 0884-2348182, 9701215511 నెంబర్లలో సంప్రదించాలి.

నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో
మరో ఇద్దరికి షోకాజ్ నోటీసులు

అన్నవరం, సెప్టెంబరు 17: అన్నవరం దేవస్థానం దత్తత దేవాలయమైన కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సుమారు రూ.16 లక్షల నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో మరో ఇద్దరికి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. ఈవో రామచంద్రమోహన్ ఇప్పటికే ముగ్గురిని సస్పెండ్ చేసి ఇద్దరికి షోకాజు నోటీసులు ఇచ్చారు. అప్పట్లో అన్నవరం ఉప కమిషనర్‌గా పనిచేసిన డీఎల్‌వీ రమేష్‌బాబు, ఏఈవో వై.శ్రీనివాసరావులకు తాజాగా మంగళవారం దేవదాయ కమిషనర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఉప కమిషనర్‌పై చర్యలు తీసుకునే అధికారం దేవదాయ కమిషనర్‌కు మాత్రమే ఉంది. ఈ వ్యవహారంపై ఈవో రామచంద్రమోహన్ దేవదాయ కమిషనర్‌కు నివేదిక ఇవ్వగా తాజాగా ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

కామాంధ గురువుపై విచారణ!


ఆసుపత్రిలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టరు

- ప్రధానోపాధ్యాయుడు చుండ్రు రామకృష్ణపై సస్పెన్షన్ వేటు
- విధుల నుంచి తొలగిస్తూ ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశాలు
- లైంగిక వేధింపులను జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ దృష్టికి తెచ్చిన 8 మంది విద్యార్థినులు

రంపచోడవరం, సెప్టెంబరు 17: అల్లూరి సీతారామరాజు జిల్లా గంగవరం మండలంలోని ఓ ఆశ్రమ బాలికల విద్యాలయంలో సుమారు ఎనిమిది మంది గిరిజన విద్యార్థినులపై ప్రధానోపాధ్యాయుడి లైంగిక వేధింపుల ఘటనపైమంగళవారం విచారణ ప్రారంభమైంది. ఈ ఘటనపై మీడియాలో కథనాలు రావడంతో అల్లూరి జిల్లా కలెక్టరు దినేష్‌కుమార్, ఎస్పీ అమిత్ బర్దర్ వేగంగా స్పందించి విచారణతో పాటు తగు చర్యలకు సూచనలు చేశారు. ఈ మేరకు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఐసీడీఎస్ అధికారి ఒకర్ని ప్రాథమిక విచారణకు పంపించారు. పూర్తిస్థాయిలో రహస్య ప్రాథమిక విచారణ జరిపించి నివేదిక ఆధారంగా హెచ్‌ఎం చుండ్రు రామకృష్ణను విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు పీవో చెప్పారు. మహిళా పోలీసులు కూడా విద్యార్థినుల నుంచి వేధింపుల వివరాలు నమోదు చేసుకున్నారు. ఎనిమిది మంది విద్యార్థినుల్లో ముగ్గురు పదవ తరగతి, ఐదుగురు ఇంటర్మీడియట్ చదువుతున్నారు. సదరు ప్రధానోపాధ్యాయుడు వేధించిన వైనాన్ని ఐసీడీఎస్ అధికారులకు, మహిళా పోలీసులకు వివరించారు. ఓ విద్యార్థినిని అయితే తాను ప్రేమిస్తున్నానని కూడా చెప్పి వేధించేవాడు. బయటకు చెప్పుకోలేని పలు విషయాలు ఈ వేధింపుల్లో దాగి ఉన్నాయి. శాఖాపరమైన విచారణలు సాగుతుండగా గిరిజన సంక్షేమ విద్యాలయాల స్థితిగతులపై పరిశీలన జరిపేందుకు వచ్చిన రంపచోడవరం ఇన్‌చార్జి మేజిస్ట్రేటు బాబు ముందు కూడా బాధిత విద్యార్థినులు తమపై జరిగిన లైంగిక వేధింపులను ఏకరువు పెట్టినట్టు సమాచారం. ఈ ఘటన తమ దృష్టికి వచ్చిందని, ఎవరి నుంచైనా పిర్యాదు అందితే కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తామని గంగవరం ఎస్ఐ రామకృష్ణ చెప్పారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చర్యలు

రంపచోడవరం, సెప్టెంబరు 17: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ క్రమశిక్షణ చర్యలకు గురై రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను మంగళవారం ఆయన సబ్ కలెక్టరు కల్పశ్రీతో కలిసి పరామర్శించారు. విద్యార్థులు పలు సమస్యలను ఐటీడీఏ పీవోకు విన్నవించారు. కళాశాలలో జరిగిన ఘటనపై విచారణకు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టరుతో పాటు మరి కొంత మందితో కమిటీని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సబ్ కలెక్టరు కల్పశ్రీ మాట్లాడుతూ విద్యార్థులకు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎం వెంకటఇందిర, వైద్యాధికారులు క్రాంతికిరణ్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పీఆర్వో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి రూ.6 లక్షలు విరాళం

అన్నవరం, సెప్టెంబరు 17: రత్నగిరిపై ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి మంగళవారం హైదరాబాద్‌కు చెందిన పోతుగుంట శ్రీలక్ష్మి రూ.6 లక్షలు విరాళం సమర్పించారు. ఈ మొత్తాన్ని దేవస్థానం పీఆర్వో కృష్ణారావుకు అందజేసింది. దాతను ఆయన అభినందించి ప్రత్యేక దర్శనం చేయించి స్వామివారి ప్రసాదం అందజేశారు.


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో 'శ్రీప్రకాష్' అధినేత నరసింహారావు

జాతీయ స్థాయి పోటీలకు
'శ్రీప్రకాష్' విద్యార్థుల ఎంపిక

తుని రూరల్, సెప్టెంబరు 17: ఈ నెల 14 నుంచి 16 వరకు సీబీఎస్ఈ బోర్డు ఆధ్వర్యంలో నల్గొండలోని ఏకశిలా అడ్వాన్స్‌డ్ లెర్నింగ్ స్కూల్లో జరిగిన క్లస్టర్-7 (ఆంధ్ర, తెలంగాణ) అథ్లెటిక్స్ పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 4X400 మీటర్ల రిలే పరుగులో అండర్-19 విభాగంలో ప్లస్ 1, ప్లస్ 2 వై.జయసత్యకుమార్, ఆదిత్యకుమార్, ఎల్.పూర్ణ శ్యామ్‌నాయుడు, శాశ్వత్ ప్రేమ్, ఎండీ సునీల్‌కుమార్ ప్రథమస్థానంలో నిలిచారు. జావలిన్ త్రోలో ఆదిత్యకుమార్ 40.90 మీటర్లతో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించడమే కాకుండా అక్టోబరు 6 నుంచి 8వ తేదీ వరకు వారాణసీలోని సెయింట్ అతులానంద్ కాన్వెంట్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. 5000 మీటర్ల పరుగులో ఎండీ సునీల్‌కుమార్ కాంస్య పతకం సాధించాడని ప్రిన్సిపాల్ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, కోచ్ శ్రీరామాంజనేయులు తదితరులు అభినందించారు.

దసరా, దీపావళి పర్వదినాలకు
21 వారాంతపు 'పూజ' ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సామర్లకోట, సెప్టెంబరు 17: రానున్న దసరా, దీపావళి పండగ రోజుల్లో ప్రయాణికులకు మరింత మెరుగైన ప్రయాణ సదుపాయాలు కల్పించేందుకు దక్షిణ మధ్య రైల్వే సామర్లకోట మీదుగా విశాఖ-బెంగళూరు-విశాఖ మధ్య నవంబరు 25 వరకు 21 వారాంతపు 'పూజ' ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్టు ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఉన్నతాధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విశాఖపట్నం-బెంగళూరు (08543) ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ విశాఖలో ప్రతి ఆదివారం సాయంత్రం 3.55 గంటలకు బయల్దేరుతుంది. దువ్వాడ, యలమంచిలి మీదుగా సాయంత్రం 5.54 గంటలకు సామర్లకోట, 6.38 గంటలకు రాజమహేంద్రవరం, అక్కడి నుంచి నిడదవోలు, తణుకు, భీమవరం, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట, కుప్పం, బంగారుపేట, కృష్ణరాజపురం మీదుగా సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు బెంగళూరు చేరుతుంది. ఈ రైలు సెప్టెంబరు 22, 29, అక్టోబరు 6, 13, 20, 27, నవంబరు 3, 10, 17, 24 తేదీల్లో ప్రతి ఆదివారం బయల్దేరుతుంది.

బెంగళూరు-విశాఖ (08544) ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు సోమవారం సాయంత్రం 3.55 గంటలకు బెంగళూరులో బయల్దేరి కృష్ణరాజపురం, బంగారుపేట, కుప్పం, జోలార్‌పేట, కాట్పాడి, రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, తణుకు, నిడదవోలు మీదుగా ఉదయం 8.33 గంటలకు రాజమహేంద్రవరం, 9.22 గంటలకు సామర్లకోట, యలమంచిలి, దువ్వాడ మీదుగా మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకు విశాఖపట్నం చేరుతుంది. ఈ రైలు సెప్టెంబరు 16, 23, 30, అక్టోబరు 7, 14, 31, 28 నవంబరు 4, 11, 18, 25 తేదీల్లో ప్రతి సోమవారం బెంగుళూరులో బయల్దేరుతుంది.

ఈ రైళ్లలో ప్రయాణించదలచిన వారు ఆయా స్టేషన్లలోని బుకింగ్ కార్యాలయాల వద్ద రిజర్వేషన్ టిక్కెట్లు పొందవచ్చని రైల్వే ఉన్నతాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

అల్లూరి యువజన సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు 'పడాల' కన్నుమూత

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 17: అల్లూరి యువజన సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు (70) అనారోగ్యంతో మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు తొలుత రాజహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలోను, అటుపై దేవీచౌక్ సమీపంలోని బుద్ధుడు ఆసుపత్రిలోను చికిత్స అందించారు. అయితే షుగరు వ్యాధి కారణంగా ఆయన కాలు పాదం దెబ్బతినడంతో పరిస్థితి విషమంగా మారింది. రాజమండ్రి ప్రెస్‌క్లబ్ సభ్యులు, బంధువులు కలిసి అంబులెన్సులో మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం నుంచి కాకినాడ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆయన కాలి వేళ్లను శస్త్ర చికిత్స చేసి తొలగించారు. అయినా బాగోలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి 7 గంటలకు పడాల తుది శ్వాస విడిచారు. పడాల స్వస్థలం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని గోరక్షణపేట. ఆయన తండ్రి పడాల రామారావు శతాధిక గ్రంథకర్త, కమ్యూనిస్ట్ ఉద్యమ నేత. తండ్రి స్ఫూర్తితో వీరభద్రరావు నిరంతరం అభ్యుదయ భావాలతో పోరాడారు. కోస్తా సమయం పత్రిక ఎడిటర్‌గా విప్లవ పార్టీల కరపత్రాలను తన ప్రింటింగ్ ప్రెస్‌లో ముద్రించి అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు పేరును రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతానికి పెట్టాలని తనదైన శైలిలో ప్రభుత్వాలను ప్రభావితం చేసిన యోధుడు పడాల. అల్లూరి జీవితం కోసం అనేక పరిశోధనలు చేసి పుస్తకాన్ని కూడా రచించారు. ఆయనకు భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు. కుమారులిద్దరూ గతంలోనే అనారోగ్యంతో మరణించారు. అయినా ఎక్కడా కుంగిపోకుండా నిరంతరం రాజీ లేని జీవన పోరాటం చేశారు. బుధవారం రాజమహేంద్రవరంలో పడాలకు అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఆయన మృతికి ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్ ప్రగాఢ సంతాపం ప్రకటించింది. పలువురు జర్నలిస్టులు, రచయితలు సంతాపం తెలిపారు.


పడాల వీరభద్రరావు (పాత చిత్రం)

40 కాసుల బంగారం చోరీ



కిర్లంపూడి, సెప్టెంబరు 17: కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవరం గ్రామంలో దొంగలు పట్టపగలే చేతివాటం ప్రదర్శించారు. సోమవరానికి చెందిన జ్యోతుల వీర వెంకట సత్యనారాయణ కుటుంబంతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేరని తెలుసుకుని గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి 40 కాసుల బంగారం, నగదు దొంగలించారు. దీనిపై బాధితులు కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, కిర్లంపూడి ఎస్ఐ సతీష్ చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్‌తో వేలిముద్రలు సేకరించారు. పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి నిందితులను పట్టుకునేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నారని చెప్పారు.

వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలి

నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ

కపిలేశ్వరపురం, సెప్టెంబరు17:వ్యాధుల బారిన పడకుండా ప్రతీఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మంగళవారం నేలటూరులో నులిపురుగు నివారణ మాత్రలను ఆయన పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యసిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నులిపురుగు వ్యాధి సోకకుండా మాత్రలు అందజేసారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురికి రూ.45వేలు సాయం

కె.గంగవరం, సెప్టెంబరు 17: అముజూరులో వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతున్న నాలుగు కుటుంబాల వారిని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పరామర్శించారు. వారికి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. కేతా వెంకట్రావుకు రూ.15వేలు, ఒళ్ల కృష్ణమూర్తికి రూ.10వేలు, పైడిమర్రి సూర్యనారాయణకు రూ. 20వేలు సొంత నిధులు అందజేశారు. వేమూరి సామ్యూల్‌ను పరామర్శించి వైద్యం నిమిత్తం అయిన ఖర్చుల తాలూకా బిల్లులు ఫైల్ చేయాలని ముఖ్యమంత్రి సహాయి నిధి నుంచి నిధులు విడుదల చేయించడానికి కృషి చేస్తామని చెప్పారు. మందుల ఖర్చులకు ప్రతీ నెల రూ.10వేలు అవుతుందని సామ్యూల్ భార్య చెప్పగా తాను సర్దుతానని మంత్రి హామీ ఇచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు మరివాడ చిన్నికృష్ణ, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ఎనుముల గోపాలకృష్ణ(చిట్టిబాబు), పెంకే నాగేశ్వరరావు, గన్ని దొరబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు అవసరాల రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రూ.755 ప్రీమియంతో రూ.15లక్షల ప్రమాద బీమా

కె.గంగవరం, సెప్టెంబరు 17: పోస్టల్ శాఖలో జీఏజీ గ్రూప్ యాక్సిడెంట్ పాలసీలో రూ.755 ప్రీమియంతో రూ.15లక్షల ప్రమాద బీమా అందజేస్తున్నామని పోస్టల్ శాఖ రాజమహేంద్రవరం సూపరింటెండెంట్ కె.శేషారావు అన్నారు. మంగళవారం పామర్రు పోస్టాఫీసును ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పోస్టల్‌శాఖ అమలు చేస్తున్న జీఏజీ పథకంలో రూ.755 వార్షిక పీమియంతో రూ.15లక్షల ప్రమాద బీమా వస్తుందని, ఇది ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

వరద బాధితులకు రూ.లక్ష విరాళం

మామిడికుదురు, సెప్టెంబరు 17: విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి నామన ఫౌండేషన్‌వారు రూ.లక్ష చెక్కును మంగళవారం మంత్రి నారా లోకేశ్‌కు అందజేశారు. ఉండవల్లిలోని నారా లోకేశ్‌ను నివాసంలో మర్యాద పూర్వకంగా నామన ఫౌండేషన్ చైర్మన్, జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు కలిసి రూ.లక్ష చెక్కును అందజేశారు. మోకా ఆనందసాగర్, దాసరి వీరవెంకటసత్యనారాయణ, సంసాని పెద్దిరాజు, పితాని కేశవ, నామన శ్రీను పాల్గొన్నారు.

దాతల సహకారంతో భోజనశాల నిర్మాణం

అంబాజీపేట, సెప్టెంబరు 17: స్థానిక జడ్పీ హైస్కూల్‌లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనశాల నిర్మాణానికి పాఠశాల పూర్వవిద్యార్థులు ముత్యాల సాయిరామ్ సోదరులు రూ.1.50 లక్షల నగదును హెచ్‌ఎం కడలి సాయిరామ్‌కు అందజేశారు. ఇప్పటివరకు పూర్వవిద్యార్థులు రూ.4లక్షలు అందించారన్నారు. వడ్లమాని గోపాలకృష్ణ రూ.లక్ష, వడ్లమాని లక్ష్మీప్రసాద్ రూ.50 వేలు, పాఠశాల అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్లు కామిశెట్టి మధుబాబు, అరిగెల రామతులసీ రూ.లక్ష విరాళం అందించారన్నారు.

విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఆలమూరు, సెప్టెంబరు17: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ సూచించారు. ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మహిళా చట్టాలు, చిన్నారులపై లైంగిక వేధింపులు నివారణపై మంగళవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ చేస్తే చట్టాలు కఠినంగా ఉన్నాయన్నారు.ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో ముమ్మిడివరం హెల్దీ లైఫ్ విద్యార్థులకు పతకాలు

ముమ్మిడివరం, సెప్టెంబరు 17: ఇటీవల అమలాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ముమ్మిడివరం హెల్దీ లైఫ్ జిమ్ విద్యార్థులు 15మంది పాల్గొనగా నాలుగు బంగారు పతకాలు, ఒక రజత, ఒక కాంస్య పతకం సాధించారు. సబ్‌జూనియర్ 120కిలోల విభాగంలో దొమ్మేటి వేణుసాగర్ ఓవరాల్ కాంస్య పతకం, బెంచ్‌ప్రెస్‌లో రజత పతకం, జూనియర్ 93కిలోల విభాగంలో నారాయణ, జూనియర్ 120కిలోల విభాగంలో ఎ.సత్యనారాయణ (బాలు) ఓవరాల్ బంగారు పతకం, బెంచ్‌ప్రెస్‌లో బంగారు పతకాలు సాధించినట్టు జిమ్ కోచ్ వాసంశెట్టి నరేష్ తెలిపారు. విజేతలకు సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు యెనుముల పద్మరాజు విజేతలకు బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో బాడీబిల్డింగ్ జిల్లా అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు, డాక్టర్ దొమ్మేటి వెంకరమణ, డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, మట్టపర్తి సముద్రం, గణేష్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

- రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్
- జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛత హీ ర్యాలీలు

మలికిపురం, సెప్టెంబరు 17: ప్రతీ ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మంగళవారం మలికిపురం పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛత హీ సేవా ర్యాలీని ఆయన ప్రారంభించారు. మలికిపురం, మోరి, గుడిమెళ్లంక, మోరిపోడు, గొల్లపాలెం తదితర గ్రామాల్లో అట్టహాసంగా ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వరప్రసాద్‌తో ఎంపీపీ ఎంవీ సత్యవాణి, ఎంపీడీవో మంగాదేవి, సర్పంచ్‌లు గెడ్డం రాజ్యలక్ష్మి, ముప్పర్తి అలివేలుమంగాత్రివేణి, పద్మమంగతాయారు, పార్టీ మండల అధ్యక్షుడు ముప్పర్తి నాని, అడబాల యుగంధర్, గుండుబోగుల పెదకాపు, గుబ్బల ఫణి, మల్లిపూడి సత్తిబాబు, గెడ్డం తులసీభాస్కర్, గెడ్డం మహలక్ష్మీప్రసాద్, అడబాల రమాదేవి పాల్గొన్నారు.



మలికిపురం: స్వచ్ఛత హీ సేవా ర్యాలీలో ఎమ్మెల్యే దేవ

స్వచ్ఛత హీ సేవా ర్యాలీ

అంతర్వేది, సెప్టెంబరు 17: ఇంటి పరిసరాలు బాగుంటేనే మండల, జిల్లా, రాష్ట్ర, దేశాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సఖినేటిపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలతో కలిసి ఆయన ప్రధాన రహదారుల్లో ర్యాలీలో వెళ్లారు. సఖినేటిపల్లి మండలం ప్రతీ గ్రామంలో స్వచ్ఛత హీ సేవా ర్యాలీలు నిర్వహిం చారు. కార్యక్రమాల్లో గుబ్బల ఫణికుమార్, ముప్పర్తి నాని, గెడ్డం మహలక్ష్మీప్రసాద్, తాడి మోహన్‌కుమార్, గుండుబోగుల పెద్దకాపు, ఇన్‌చార్జి తహసీల్దార్ భాస్కర్, ఎంపీడీవో సత్యనారాయణ, రావూరి నాగు, కూటమి శ్రేణులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

మండపేట, సెప్టెంబరు 17: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేటలో మంగళవారం స్వచ్ఛత హీ సేవా ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వేగుళ్ల, చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, విద్యార్థులు, మున్సిపల్ ఉద్యోగులు, రోటరీ క్లబ్, పారిశుధ్య కార్మికులు మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, రామచంద్రపురం ఇన్‌చార్జీ డీఎల్‌పీవో రాజు, ద్వారపూడి పంచాయతీ కార్య దర్శి ఆకుల వెంకటరమణ, కార్యదర్శులు, మండపేట మున్సిపల్ మేనేజర్ కనకరాజు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్ ఏర్పాటుకు కృషి చేస్తాం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 17: జిల్లా కేంద్రమైన అమలాపురంలో ఆటో కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తామని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు హామీ ఇచ్చారు. ది అసోసియేషన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ ఆధ్వర్యంలో మంగళవారం యెండూరి కన్వెన్షన్ హాలులో ప్రజాప్రతినిధుల సన్మానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ చేసిన పలు ప్రతిపాదనల అమలుకు కృషి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. ప్రధానంగా కోనసీమ రైల్వేలైన్ నిర్మాణాన్ని పూర్తి చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. అనంతరం నేతలను సత్కరించారు. కార్యదర్శి యెండూరి నాగేశ్వరరావుతో పాటు పలువురు పాల్గొన్నారు

గణపతి లడ్డూకు అధిక ధర

ముమ్మిడివరం, సెప్టెంబరు 17: ముమ్మిడివరం మార్కెట్ సెంటర్‌లోని మార్కెట్ గణపతి వర్తక సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి జగతా సత్యనారాయణ సమర్పించిన 30కిలోల లడ్డూకు మంగళవారం ఆలయ కమిటీ పాట నిర్వహించింది. పాటలో ఓ భక్తుడు రూ.71,116కు సొంతం చేసుకున్నాడు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మార్కెట్ శివారులోని శ్రీలక్ష్మీగణపతి ఆలయం వద్ద లక్ష్మీగణపతి ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

నేషనల్‌గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పును అమలుచేస్తే ఆత్మహత్యలే



కరవాకలో ఎన్జీటీ తీర్పును నిరసిస్తూ నినాదాలు చేస్తున్న ఆక్వా రైతులు

మామిడికుదురు, సెప్టెంబరు 17: నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పును అమలుచేస్తే ఆత్మహత్యలు తప్పవని ఆక్వా రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్జీటీ తీర్పును నిరసిస్తూ కరవాకలోని ఆక్వారైతులు మంగళవారం ధర్నా చేశారు. 300కుటుంబాలు ఆక్వాసాగుచేస్తూ జీవనం సాగిస్తున్నారని, ఈతీర్పును అమలుచేస్తే తామంతా జీవనోపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వా చెరువులకు గండ్లు కొడితే నిరుపేదలమైన తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తమకు న్యాయం చేయాలని లేనిపక్షంలో తామంతా పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడతామని అల్టిమేటం ఇచ్చారు. ఎన్జీటీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని తమను ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రేకాడి సత్యనారాయణ, రేకాడి నాగరాజు, మల్లాడి వడ్డికాసులు, మాజీ సర్పంచ్ కొల్లు బాలకృష్ణ, మత్స్యకార నాయకుడు కొల్లు జోగిరాజు, రేకాడి దుర్గాప్రసాద్, రేకాడి శేఖర్, తిరుమాని నాగూర్ మీరాసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

కొమరగిరి సొసైటీలో ఏరియేటర్స్ కుంభకోణం

సహకార అసిస్టెంట్ రిజిస్ట్రార్ విచారణ

ఐ.పోలవరం, సెప్టెంబరు17: కొమరగిరి సొసైటీలో ఏరియేటర్స్ స్కామ్ బయటపడింది. సొసైటీ అధ్యక్షుడు, సిబ్బంది కుమ్మక్కై లక్షల రూపాయల ఏరియేటర్స్‌కు సంబంధించిన నిధులు దుర్వినియోగం చేశారని సొసైటీ మాజీ అధ్యక్షుడు కలిదిండి సీతారామరాజు జిల్లా సహకార బ్యాంకు సీఈవోకు ఫిర్యాదు చేశారు. ముమ్మిడివరం సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ వి.వెంకటనారాయణ మంగళవారం విచారణ నిర్వహించారు. 3గంటలు జరిగిన విచారణలో మురమళ్ళ డీసీసీబీ మేనేజర్ జీవీ మనోహర్, సొసైటీ సీఈవో ఎన్.గోపాలకృష్ణతో పాటు ఫిర్యాదుదారు కలిదిండి సీతారామరాజు హాజరయ్యారు. ఏరియేటర్లను రైతులకు అద్దెకిచ్చే వ్యాపారాన్ని సొసైటీ ప్రారంభించింది. కోట్లాది రూపాయల విలువైన ఏరియేటర్ల అద్దె వసూళ్లలో నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపణ. బాధ్యులైన అధికారుల నుంచి సొమ్ము రికవరీ చేయాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.



కొమరగిరి సొసైటీలో విచారణ చేస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్

కొత్తపేట లేఅవుట్‌పై ఫిర్యాదు.. డీపీవో, డీఎల్పీవో విచారణ



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న డీఎల్పీవో రాజు

కొత్తపేట, సెప్టెంబరు 17: కొత్తపేట ప్రధాన రహదారి చెంతనే లేఅవుట్ నిబంధనలకు విరుద్ధంగా వేశారనే ఫిర్యాదు మేరకు మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు, డీఎల్పీవో ఏ.రాజు విచారణ చేపట్టారు. ఈలేఅవుట్ డీటీసీపీ లేఅవుట్ అయినప్పటికి దానిని మార్పుచేసి ప్రభుత్వ బోదెను ఆక్రమించారని గ్రామానికి చెందిన బండారు వీరన్నకాపు, సిద్దంశెట్టి శివాజీ చేసిన ఫిర్యాదుపై జిల్లా పంచాయతీ అధికారులు స్పందించారు. లేఅవుట్‌ను క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా ఉందని గుర్తించారు. 4.19 ఎకరాల లేఅవుట్ అప్రూవుడ్ ప్లాన్ ప్రకారం కాకుండా ప్లాన్ మార్చి వేసినట్లు గుర్తించారు. దీనిపై ఈలేఅవుట్ స్థలాలను కొనుగోలు చేస్తే పంచాయతీ అప్రూవల్ ఇవ్వదని, అంతేకాకుండా ఈవిషయం సబ్ రిజిస్ట్రార్‌కు లేఖను అందించాలని పంచాయతీ కార్యదర్శి వేగుళ్ల వెంకటరామన్‌కు డీపీవో సూచించారు. అనంతరం పంచాయతీ కార్యాలయానికి వచ్చిన జిల్లా పంచాయతీ అధికారులకు గ్రామానికి చెందిన పలువురు పలు సమస్యలను చెప్పారు. పారిశుధ్య కార్మికుల వేతనాల జాప్యంపై ఫిర్యాదు చేశారు.

రూ.50వేలు విరాళం

ఆత్రేయపురం, సెప్టెంబరు17: వాడపల్లి ఆలయంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి గుడివాడకు చెందిన బోను నాగమణి రూ.50,101 విరాళం ఇచ్చారు.

ఘనంగా ప్రధాని మోదీ పుట్టినరోజు వేడుకలు



పి.గన్నవరంలో కేక్‌కట్ చేస్తున్న బీజేపీ సీనియర్ నాయకులు చెరుకూరి గోపాలకృష్ణ, ఎంపీపీ నాగలక్ష్మి, కూటమి నాయకులు

పి.గన్నవరం, సెప్టెంబరు 17: బీజేపీ సీనియర్ నాయకుడు చెరుకూరి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు వేడుకలను పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి కేక్ కట్‌చేసి కూటమి నాయకులకు అందించారు. వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, యర్రంశెట్టి సాయిబాబు, బొరుసు సుబ్బరాజు, పితాని వెంకటేశ్వర్లు, తాటికాయల శ్రీను, ఏడ్ల ఏసు, కర్రిబాబురాబు, తాటికాయల వెంకటేష్, తానంకి నాగరాజు, చీకరమిల్లి శ్రీనివాసరావు, మానేపల్లి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ: ప్రధానీ మోదీ జన్మదిన వేడుకలు మంగళవారం ద్రాక్షారామ బోసు బొమ్మ సెంటర్‌లో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేకు కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనకాపల్లి ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.బుల్లబ్బులు, జిల్లాట్రేడర్స్ సెల్ కన్వీనర్‌కొట్టువాడ హరిబాబు, టెలికం బోర్డు సభ్యులు గుర్రాల సత్యనారాయణ, జిల్లా కార్యవర్గసభ్యుడు పెయ్యల రాంబాబు, అల్లం రామకృష్ణ, సలాది వీరబాబు పాల్గొన్నారు.

మామిడికుదురు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు వేడుకలను మొగలికుదురులోని శ్రీసత్యసాయి భరోసా దీనజనోద్ధరణ ఆశ్రమంలో బీజేపీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలశాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులు, అనాథ పిల్లలకు పాలు, బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు చీకురుమెల్లి వెంకటేశ్వరరావు, కంకిపాటి సుబ్బారావు, గాడి సత్తిబాబు, వేగి వెంకటేశ్వరరావు, నన్నేసా హుస్సేన్, భైరిశెట్టి రమణ, అప్పన రాము తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: సోమేశ్వరంలో బీజేపీ నాయకులు ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు శాకా దుర్గా శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్‌ను కత్తిరించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు గ్రామంలో స్వీట్స్ పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు, నరాల రాంబాబు, చిరట్ల సుబ్బారావు, నిమ్మకాయల సాయిరాం ప్రసాద్, ముప్పాటి కృష్ణ, మద్దిపాటి బ్రహ్మయ్య చౌదరి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండపేట: ప్రధాని మోదీ 74వ జన్మదిన వేడుకలను బీజేపీ శ్రేణులు మంగళవారం జరుపుకున్నారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోటిపల్లి సాయిరాం, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోనసత్యనారాయణ పాల్గొన్నారు. ద్వారపూడిలో బీజేపీ యువ నాయకుడు టి.మురళీకృష్ణ నేతృత్వంలో కేక్ కట్ చేసి గ్రామంలో మొక్కలు నాటారు. మండపేట పట్టణం, మండలంలో బీజేపీ శ్రేణులు మోదీ జన్మదిన వేడుకలను జరుపుకుని పేదలకు అన్నదానం చేశారు.

మలికిపురం: ప్రధాని మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని కేశనపల్లిలో ఎన్డీఏ నాయకుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. విద్యార్థులకు మొక్కల ప్రాధాన్యం పై అవగాహన కల్పించారు. రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు ఎంఏ వేమా, కేశనపల్లి సర్పంచ్ యెనుముల నాగు, ఎంపీటీసీ రాపాక సత్యనారాయణ, అడబాల రాంబాబు, యెనుముల బాబ్జి పాల్గొన్నారు.

అంతర్వేది: సఖినేటిపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు మిఠాయిలు పంచి ప్రధాన నరేంద్రమోదీ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్, రాష్ట్ర కిసాన్‌మోర్చా డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు మాట్లాడట ప్రధాని మోదీ సంక్షేమ అభివృద్ధిని దేశానికి అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పట్టాపు సూర్యప్రకాశరావు, పోతురాజు సురేష్, పోలిశెట్టి గంగాశ్రీగిరిబాబు, తిరుమాని వెంకటేశ్వరరావు, యిందుకూరి సుబ్బరాజు, అయినవిల్లి సత్యనారాయణ, బొమ్మిడి నరసింహస్వామి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రావులపాలెం: రావులపాలెంలో కూటమి శ్రేణుల ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేసి మోదీ జన్మదిన వేడు కలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ తెలుగు రైతు రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆకుల రామకృష్ణ, నాయకులు గుత్తుల పట్టాభి రామారావు, పాలూరి సత్యా నందరావు, మైగాపుల గుర్రవయ్యనాయుడు, నందం వీరవెం కటసత్యనారాయణ, ఆకుల భీమేశ్వరరావు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

చెన్నైలో జొన్నాడ అయ్యప్పస్వాములకు ఆదరణ

ఆలమూరు, సెప్టెంబరు17: చెన్నైలో స్థిరపడిన ఆలమూరు మండలం జొన్నాడ వాసి కుడకా సత్యకుమార్, వీరవేణి దంపతులు చెన్నై రైల్వే స్టేషన్‌లో జొన్నాడ అయ్యప్ప స్వామి భక్తులకు వడి ఏర్పాటు చేశారు. జొన్నాడ మాజీ సర్పంచ్ ద్వారంపూడి దొరబాబు ఆధ్వర్యంలో వెళుతున్న భక్తులకు సోమవారం రాత్రి స్వాగతంపలికి అనంతరం స్టేషన్‌లో స్వాములకు వడి ఏర్పాటు చేశారు. సొంతూరుపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు.

కంప్యూటర్ బహూకరణ

ముమ్మిడివరం, సెప్టెంబరు 17: సీహెచ్ గున్నేపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ మండల కన్వీనర్ గొలకోటి వెంకటరెడ్డి రూ.30వేలు విలువైన కంప్యూటర్‌ను బహూకరించారు. దానిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు ప్రారంభించారు.

రూ.5లక్షల విరాళం



అమలాపురం టౌన్, సెప్టెంబరు 17: విజయవాడ వరద బాధితుల సహాయార్థం అమలాపురం పట్టణానికి చెందిన తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెరుకూరి సాయిరామ్ రూ.5లక్షల విరాళం చెక్కును మంగళవారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌కు అందజేశారు.

20న రామచంద్రపురంలో జాబ్ మేళా

అమలాపురం టౌన్/ద్రాక్షారామ, సెప్టెంబరు 17: ప్రముఖ ప్రైవేటు కంపెనీల్లో 270పోస్టులు భర్తీ చేసేందుకు ఈనెల20న రామచంద్రపురం వీఎస్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి యి.వసంతలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉపాధి కార్యాలయం, స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగే జాబ్‌మేళాలో ఎల్ఎంఎస్ కోఆపరేటివ్ సర్వీసెస్ (కియా మోటార్స్)లో వంద ఆపరేటరు పోస్టులకు, ఎస్‌బీఐ కార్డ్స్ క్విస్‌కార్ప్‌లో వంద బ్రాంచి రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు, యాక్సిస్ బ్యాంకుకు సంబంధించి ఐటీఎం స్కిల్ అకాడమీలో 70సేల్స్ ఆఫీసర్ పోస్టుల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. పదో తరగతి ఇంటర్ డిగ్రీ, బీటెక్ పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులని, వివరాల కోసం సెల్ 8121838392ను సంప్రదించాలన్నారు.

కొత్తగా చేనేత సహకార సంఘాల ఏర్పాటుకు అవకాశం

అమలాపురం రూరల్, సెప్టెంబరు 17: జిల్లాలో కొత్తగా చేనేత సహకార సంఘాల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తూ చేనేత జౌళి శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేసినట్టు జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి కె.పెద్దిరాజు తెలిపారు. కొత్తగా చేనేత సహకార సంఘం ఏర్పాటుకు కనీసం 30మంది సభ్యులు ఉండాలన్నారు. సొంత మగ్గం కలిగి ఉండి చేనేత వృత్తిపై ఆధారపడుతున్న కార్మికులు సంఘ సభ్యత్వం పొందేందుకు అవకాశం కల్పించారన్నారు. చేనేత గ్రామాల్లోని ప్రాథమిక సహకార సంఘాలను సంప్రదించి కొత్తగా సభ్యత్వంకోసం ఈనెల20వతేదీలోపు నమోదు చేయించుకోవాలన్నారు.

వివేకానందలో ఓజోన్ డే

మలికిపురం, సెప్టెంబరు 17: విశ్వేశ్వరాయపురం వివేకానంద పాఠశాలలో మంగళవారం ఓజోన్ డే పురస్కరించుకుని చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. రిఫ్రిజిరేటర్లను, ఏసీల వినియోగం తగ్గించాలని నినాదాలు చేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్
శ్రీలలిత	: భలే ఉన్నాడే
శేఖర్ స్క్రీన్-1	: కళింగ
శేఖర్ స్క్రీన్-2	: 35
రమా	: మత్తువదలరా-2
గణపతి	: మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
వెంకటపద్మావతిస్క్రీన్-1	: సరిపోదా శనివారం
వెంకటపద్మావతి స్క్రీన్-2	: ఏఆర్ఎం

ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి

అమలాపురం టౌన్, సెప్టెంబరు 17: బాణసంచా సామగ్రి తయారు చేస్తున్న ఇంట్లో జరిగిన ప్రమాదంలో గాయపడ్డ బాధితులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లాశాఖ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం సంఘటనా స్థలాన్ని కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన పరిశీలించి బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు రూ.10లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీను, నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి, పట్టణశాఖ అధ్యక్షుడు వంటెద్దు బాబి, కుడుపూడి శ్రీను, యార్లగడ్డ రవీంద్ర, రాయుడు వెంకటరమణ, రాయుడు గంగాభవాని, సుగ్గు ప్రసాద్, పేరి శర్మ, పులుసుగంటి ప్రకాష్, వస్కా బాబు పాల్గొన్నారు.

మండపేట మున్సిపల్ కమిషనర్‌గా రంగారావు



మండపేట, సెప్టెంబరు17: మండపేట మున్సిపల్ కమిషనర్‌గా టి.వి.రంగారావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా కనిగిరి నుంచి ఇక్కడకు బది లీపై వచ్చారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయనను ఉద్యో గులు మర్యాదపూర్వకంగా కలిశారు. 2019లో ఇక్కడ కొంత కాలం ఆయన కమిషనర్‌గా పనిచేశారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణిలను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన బి.రాము విశాఖకు బదిలీ అయ్యారు.

దాతృత్వం చాటుకున్న మహిళామండలి

అమలాపురం టౌన్, సెప్టెంబరు 17: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు మానవతా దృక్పథంతో ప్రవాస్‌భారతీయ మహిళా మండలి సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.20వేల చెక్కును, ప్రవాస భారతీయుల తల్లులు రూ.30వేల చెక్కును మంగళవారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు అందజేశారు. దాతృత్వం చాటుకున్న మహిళా మండలి సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు పి.సత్యకుమారి, మాజీ అధ్యక్షురాలు పోలిశెట్టి అనంతలక్ష్మి, కల్వకొలను చాయాదేవి, పంపన పద్మలత, వి.లలితాకామేశ్వరి, వి.జమున, ఎ.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ఆత్రేయపురం, సెప్టెంబరు 17: పులిదిండిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

బాధితులకు ఎంపీ హరీష్ పరామర్శ

రాజోలు, సెప్టెంబరు 17: మామిడికుదురు మండలం మగటపల్లిలో తేనెటీగలు దాడి, పిచ్చికుక్క స్వైర విహారంలో గాయపడి రాజోలు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ పి.సూర్యనారాయణకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా శ్రీను, రాజోలు మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, ఉపసర్పంచ్ పామర్తి రమణ, మంగెన నాని, బందెల పద్మ, కసుకుర్తి త్రినాథస్వామి, పొలమూరి శ్యామ్‌బాబు, అడబాల విజయ్, రావి మురళీ, కోఆప్షన్ సభ్యులు షేక్ ఇస్మాయిల్, సర్పంచ్ కడలి సత్యనారాయణ, గుబ్బల కుమార్, కాంట్రేగుల కృష్ణ, కుశులుడు, కడలి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి ఎంపిక

ద్రాక్షారామ, సెప్టెంబరు17: ఆదిత్య యూనివర్శిటీ సూరంపాలెంలో నిర్వహించిన భారత్ టెక్‌లీగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో నరసాపురపుపేట జడ్పీ హెచ్ఎస్ విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపికయ్యారు. క్లీన్ ఎనర్జీ విభాగంలో ఎస్.స్రవంతి, సీహెచ్‌సుమశ్రీ, ఎం.హేమశ్రీలు మొదటి బృందంగా, పి.బాలాజీ, ఎం.ఎస్.వి.వి.సాయిలురెండో బృందంగా ఎంపికయ్యారు. ఉపాధ్యాయురాలు జి.ఉమాశ్రీవాణి గైడ్ టీచర్‌గా వ్యవహరించారు. వీరిని హెచ్ఎం కె.కె.ఎల్.కుమారి, సర్పంచ్ సీహెచ్‌వీరలక్ష్మి, ఎంపీటీసీ జ్ఞానలక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ పి.కృష్ణవేణి, వైస్‌చైర్మన్ పి.శ్రీనివాస్ అభినందించారు.

హెరిటేజ్ డెయిరీని సందర్శించిన మంత్రి సుభాష్

సీఎస్ఆర్ నిధులతో మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి



హెరిటేజ్ డెయిరీలో మంత్రికి స్వాగతం పలుకుతున్న డెయిరీ సిబ్బంది

కె.గంగవరం, సెప్టెంబరు 17: యండగండిలో ఉన్న హెరిటేజ్ డెయిరీ యూనిట్‌ను కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం పరిశీలించారు. డెయిరీకి వచ్చిన మంత్రి సుభాష్‌కు డెయిరీ డీజీఎం వంశీధర్, ఏపీ స్టేట్ హెడ్ రామకృష్ణ చౌదరి, ప్లాంట్ మేనేజర్ బాలహరి, సేల్స్‌మేనేజర్ గణేష్ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ప్లాంట్‌లో తయారు చేసే ఉత్పత్తులు, ప్లాంట్ కెపాసిటీ, ప్యాకింగ్ సెక్షన్, రైతులకు ఇస్తున్న రాయతీలు, డెయిరీ ఉద్యోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు గురించి డీజీఎం వంశీధర్ వివరించారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో డయాలసిస్ సెంటర్, ఫిజియోథెరపీ సెంటర్, గ్రామాల్లో శ్మశాన వాటికలు, మహాప్రస్థానం వాహనాలు ఏర్పాటుకు సీఎస్ఆర్ నిధులు కేటాయించాలని, దీనిపై యాజమాన్యంతో మాట్లాడాలని డీజీఎం వంశీధర్‌ను కోరారు. జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చుండ్రు వి.వి.ఎస్.ఎస్.చౌదరి, మరివాడ సూరిబాబు, తహసీల్దార్ కె.సూర్యారావు, మరివాడ చిన్నికృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు మెటీరియల్ అందజేత

కె.గంగవరం, సెప్టెంబరు17: 25ప్రైమరీ పాఠశాలలు, 2యూపీ, 2ఉన్నత పాఠశాలల నుంచి నవోదయ, ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు హాజర వుతున్న 70మంది విద్యార్థులకు రూ.20వేలు విలువైన మెటీరియల్‌ను కుం దూరులో సత్యస్కాన్ డాక్టర్ కాదా వెంకటరమణ అందజేశారు. ఎంపీపీ పం పన నాగమణి సుబ్బారావు, సర్పంచ్ పంపన సత్యానందం, కూటమి నాయ కులు పల్లా చినబాబు, వనచర్ల శ్రీనివాస్, తాడి హరికృష్ణ, పామర్తి బాబి, జగతా రమణ, మాజీసర్పంచ్ బత్తుల విజయకుమారి అప్పారావు పాల్గొన్నారు.

'జత్వానీ కేసులో అసలు సూత్రధారి జగన్‌రెడ్డే'

అమలాపురం టౌన్, సెప్టెంబరు 17: ముంబై నటి కాదంబరి జత్వానీ కేసులో అసలు సూత్రధారి, పాత్రధారి మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డేనని తెలుగుమహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి అన్నారు. రోత పత్రికలో మహిళలను కించపరిచేలా నీచపు రాతలు రాస్తున్నారని ఎద్దేవా చేశారు. అధికార దుర్వినియోగానికి పాల్పడ్డ ప్రతిఒక్కరినీ శిక్షించాల్సిందేనన్నారు. సమావేశంలో తెలుగు మహిళ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ మాకిరెడ్డి వీఎన్ఎస్ పూర్ణిమ, జనసేన డాక్టర్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొప్పుల నాగమానస, కూటమి మహిళా నేతలు గెల్లా మీనాకుమారి, చిట్టూరి రాజేశ్వరి, మోకా ఆదిలక్ష్మి, జగతా శాంతి, చాట్ల మంగతాయారు, తిక్కా సరస్వతి, కర్రి లక్ష్మీదుర్గ, గుమ్మడి నాగమణి, గెద్దాడ సత్యవాణి, అప్పారి సుశీల పాల్గొన్నారు.

దుర్గా భవానీకి రూ.లక్ష సాయం

అంతర్వేది, సెప్టెంబరు17: గొందిలో ఇటీవల జరిగిన విద్యుత్ ప్రమాదంలో గుర్రై బర్రే దుర్గాభవానీ తీవ్రంగా గాయపడింది. సఖినేటిపల్లిమండల డ్వాక్రా వీవోఏస్ సిబ్బంది డ్వాక్రా సంఘాల మహిళలు కలిసి రూ.1.04 లక్షలను ఏపీఎం కె.విజయ్ మంగళవారం అందించారు. ఏపీఎం అజయ్ అన్నారు. గొంది సర్పంచ్ దొండపాటి రవికుమార్, ఎంపీటీసీ నానిపాల్గొన్నారు.

గోదావరిలో మృతదేహం లభ్యం

ముమ్మిడివరం, సెప్టెంబరు 17: ముమ్మిడివరం మండలం పళ్లవారిపాలెం వివేకానంద వారధి వద్ద గౌతమీ గోదావరి నదీపాయలో మంగళవారం ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానిక వీఆర్వో కేశనకుర్తి రవికుమార్ ఇచ్చిన సమాచారంతో ఎస్ఐ బి.జ్వాలాసాగర్, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గోదావరి నుంచి బయటికి తీయించారు. బ్యాగులో ఉన్న ఆధారాల ప్రకారం విజయవాడ రూరల్ మధురానగర్‌కు చెందిన సూర్యనారాయణ (53)గా భావిస్తున్నారు. గంజా కేసులో ముద్దాయి. సూర్యనారాయణ చెడు ప్రవర్తనతో విసిగి చెందిన భార్య ఇద్దరు పిల్లలతో వేరుగా ఉంటున్నట్టు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిసింది. మృతదేహాన్ని అమలాపురం ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. పూర్తివివరాలు కుటుంబ సభ్యులు వస్తేగానీ తెలియదన్నారు.

రోడ్డు పనులు పరిశీలించిన ఆర్అండ్‌బీ అధికారులు

ముమ్మిడివరం, సెప్టెంబరు17: ముమ్మిడివరం నగర పంచాయతీ, బాలయోగీశ్వరుల తపో ఆశ్రమం ఆర్అండ్‌బీ రోడ్డు అధ్వానంగా ఉంది. మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్, ప్రస్తుత ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు చొరవతో రోడ్డు ఆధునికీకరణకు నిధులు మంజూరయ్యాయి. రూ.1.20కోట్లతో సిమెంట్ రోడ్డుగా ఆధునికీకరిస్తున్న పనులను ఆర్అండ్‌బీ ఈఈ బి.రాజు, డీఈఈ కేఎస్ రాఘవరావు మంగళవారం పరిశీలించారు. నాణ్యాతా ప్రమాణాల విషయంలో లోపాలు చోటు చేసుకుంటే చర్యలు చేపడతామని వారు పేర్కొన్నారు.


అధ్యాపకుల సమ్మెకు ఎమ్మెల్యే సంఘీభావం

మలికిపురం, సెప్టెంబరు 17: నాలుగు నెలలుగా జీతాలు చెల్లించడం లేదంటూ సమ్మె చేస్తున్న అధ్యాపకులకు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సంఘీభావం ప్రకటించారు. ఎంపీఎన్‌జేఎస్ అండర్‌ఆర్వీఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన అధ్యాకుల సమ్మె ఏడో రోజుకు చేరింది. ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళతానన్నారు. ఎమ్మెల్యే వెంట గుండుబోగుల పెదకాపు, ముప్పర్తి నాని, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, మల్లిపూడి సత్తిబాబుపాల్గొన్నారు.

టీడీపీ కోఆర్డినేషన్ ఇన్‌చార్జులతో సమీక్ష

పి.గన్నవరం, సెప్టెంబరు 17: ఉండవల్లిలో ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గాల కోఆర్డినేషన్ ఇన్‌చార్జులతో రివ్యూ జరిగింది. నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, కోకన్వీనర్లు మోకా ఆనందసాగర్, దాసరి వీరవెంకటసత్యనారాయణ పాల్గొన్నారు.

వలీబాబా దర్గాలో జియారత్



వలీబాబా దర్గాను దర్శించుకుంటున్న భక్తులు

ముమ్మిడివరం, సెప్టెంబరు 17: కొత్తలంకలోని వలీబాబా దర్గా వద్ద ఉరుసు మహోత్సవాల సందర్భంగా మంగళవారం హిందూ-ముస్లింలు భక్తిశ్రద్ధలతో జియారత్ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం నాటి జియారత్ కార్యక్రమంతో మూడు రోజుల పాటు నిర్వహించిన ఉరుసు ఉత్సవాలు ముగిశాయి. హిందూ-ముస్లింలు ప్రసాదాన్ని గ్రామంలోని జెండా స్తంభం వద్ద నుంచి ఫకీర్లతో డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా బాబా దర్గాకు తీసుకువచ్చి బాబాకు సమర్పించారు. అనంతరం భక్తులకు ఆ ప్రసాదాన్ని వితరణ చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి హిందూ-ముస్లిం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి బాబా దర్గాను దర్శించుకుని వారివారి మతాచారాల ప్రకారం పూజలు చేశారు. ముజావర్ ఆలీబాబా, కమిటీ సభ్యుడు గేదెల రఘునాథబాబా, నూకల శివ, గేదెల ఉదయభాస్కర్‌ల ఆధ్వర్యంలో దర్గాకు విచ్చేసిన భక్తులకు వసతి, మంచినీటి వంటి సౌకర్యాలు కల్పించారు. మంగళవారం నాటి జియారత్‌తో ఉరుసు ఉత్సవాలు ముగిశాయి.